# ఎదటివాడు

శ్రీధరం పై కండువా సర్దుకుని, సంచి పట్టుకుని, గొడుగు తీసుకొన్నాడు. గొడుగూ సంచీ వో చేతిలోకి తీసుకుని, లాల్చీ జేబులోని టిక్కెట్ చేతిలోకి తీసుకున్నాడు.

ఆ స్టేషనులో రైలు అట్టేసేపు ఆగదు. కాగా రైలెక్కేవాళ్లు, దిగేవాళ్లని దిగనివ్వరు, రైలు బయలుదేరుతుందేమోనన్న ఆదుర్దాలో! ఓవరకు ఎక్కేవాళ్లూ, దిగేవాళ్లూ, బలాబలాలు చూసుకోవాల్సిందే! క్రితంసారి వచ్చినప్పుడు ....నాలుగేళ్ల క్రితం దిగలేక ధోవతీ కాళ్లకడ్డంపడి, ప్లాట్‌ఫారం మీద బోర్లా పడిపోయాడు శ్రీధరం! అందుకనే మరికొద్ది సేపట్లో రైలు స్టేషన్‌లోకి ప్రవేశిస్తుందనగానే శ్రీధరం ఈసారి జాగ్రత్త పడ్డాడు.

రైలు ఆగింది! శ్రీధరం దిగాడు. కానీ ఈసారి అతనూహించినంత శ్రమ పడాల్సిన అవసరం కలుగలేదు। హాయిగా, రాజాలాగా దిగాడు! ఆవేళ అట్టే జనం రైలెక్క వలసినవాళ్లూ, దిగాల్సినవాళ్లూ లేరు!

శ్రీధరం ప్లాట్‌ఫారం అంతా పరిశీలించాడు! ఆ ఓవర ఉండాల్సిన రావి చెట్టు లేదు! స్టేషన్‌లో కొత్తగా టీ దుకాణం వెలిసింది! అంతకు మినహా మార్పులేదు ఈ నాలుగేళ్లలోనూ!

రైలు వెళ్లేదాకా ప్లాట్‌ఫారంమీదే నిలబడ్డాడు శ్రీధరం!

రైలు వెళ్లింది. పోర్టరు ప్రయాణికుల దగ్గరికొచ్చి టిక్కెట్లు తీసుకుంటున్నాడు! శ్రీధరం యిచ్చేశాడు!

సాయం సంధ్య తగ్గిపోసాగింది. సూర్యభగవానుడు మాతృగర్భంలో జారబడుతున్నాడు!

"చలపతి రాలేదు!" అనుకున్నాడు శ్రీధరం. రానందుకు మనస్సులో బాధగానే ఉంది! పైగా తను వస్తున్నట్లు ఉత్తరం ముందుగానే వ్రాశాడు! కాబట్టి తన రాక తెలియదన్న కారణం చూపేందుకు అవకాశంలేదు!

ఇలా ఆలోచిస్తూ నిల్చుంటే ప్రొద్దుగూకుతుంది! నాలుగు మైళ్లు నడవాలి! ఇక్కడదాకా వచ్చి వెనక్కు వెళ్లటం మంచిది కాదు! అని నిర్ణయించుకున్నాడు శ్రీధరం! కండువాతో మోహం తుడుచుకున్నాడు! సంచిలోంచి, రైల్లో కొన్న దువ్వెనతో తల ధువ్వుకున్నాడు.

"నమస్కారం బాబూ। ఎంతసేపైంది వచ్చి।" వెంకటస్వామి చేతులు కట్టుకు ఎదురుగ్గా నిలబడ్డాడు।

శ్రీధరం చెప్పాడు.

"మధ్యలో కారు ట్రబులిచ్చిందిబాబూ। లేకపోతే రైలు వేళకే వచ్చేవాణ్ణి........పదండి బాబూ వెడదాం। కారు బయటుంది........"

వెంకటస్వామి గొడుగు, సంచీ అందుకున్నాడు.

శ్రీధరం వెళ్లి కారులో కూర్చున్నాడు। "వెంకటస్వామీ........రెండు టీ తెమ్మని చెప్పు........తలనొప్పిగా వుంది।"

వెంకటస్వామి టీ తేవటానికి వెళ్లాడు।

చలపతి మళ్లీ కారు కొన్నాడు. క్రితంసారి వచ్చినప్పటిది కాదు. పాతదేంచేశాడో? ఏం చేస్తాడు? అమ్మేసుంటాడు।

చలపతి చాలా అదృష్టవంతుడు। కాకపోతే కూటికి గతిలేనివాడు యిప్పుడు లక్షలకధికారి! పావలాపెట్టి కారెక్కలేనివాడు కార్లు కొనటం, అమ్మటం చేస్తున్నాడు।

"టీ బాబూ।"

"నీకో?"

"నే త్రాగేసొచ్చాను."

శ్రీధరం టీ త్రాగి కప్పుతో డబ్బులిచ్చాడు. వెంకటస్వామి డబ్బులు తీసుకోలేదు.

"అదేం? నువ్విచ్చావా?"

"కాదు బాబూ। ఆ బడ్డీ అయ్యగారే పెట్టించారు. ఆ అభిమానం బాబూ। డబ్బుల్దీసుకోడు."

"ఊహూ."

మట్టి రోడ్డు మీద నృత్యం చేస్తూ కారు పరిగెడుతోంది!

"అయ్యాగారూళ్లో లేరా?"

"ఉన్నారు బాబూ."

శ్రీధరం మళ్లీ మాట్లాడలేదు.

"వూళ్లో ఉండి రాలేదన్నమాట."

చలపతి హోదా పెరిగింది. గర్వం ఇనుమడించింది. లేకపోతే ప్రాణానికి ప్రాణమిచ్చే తను వస్తే స్టేషనుకు రాలేడు. మర్యాదకు కారు మాత్రం పంపాడు. అదీ ఎందుకు? తన గొప్ప, ఐశ్వర్యం చాటుకునేందుకు. ఐశ్వర్యపు టంచుల మీద నిలబడి, హేళనగా తనబోటివాడిని చూచి పరిహసించేందుకు. తమమధ్య వుండే అంతరాన్ని, దూరాన్ని పదే పదే వేలెత్తి చూపేందుకు.

శ్రీధరం కారులో కూర్చోవటం సుఖంగాలేదు. ఎత్తెత్తి, కుదేసి పూపే స్తున్నది. గట్టిగా పట్టుకూర్చున్నాడు. రోడ్డు కిరువైపుల బీటలు దీసిన పంట పొలాలు నిశ్శబ్దంగా నిద్రపోతున్నాయి. తీతువుపిట్ట ఆకాశంలో గిరికీలు కొడుతున్నది.

"ఐతే తన పని కాదన్నమాట." శ్రీధరం మనస్సులో అనుమానం పెరుగసాగింది.

వూరికి బయల్దేరేందుకు వాకిట్లో అడుగుపెట్టంగానే ఎదురింటి విధవావిడ పిల్లి నెత్తుకొని, ముసుగు సర్దుకుంటూ ఎదురైంది. అప్పుడే అనుకున్నాడు తను వెళ్లేపని సానుకూలపడదని. ఐనా మొండిగా బయలు దేరాడు. తీరా స్టేషనుకొస్తే రైలు గంట ఆలస్యం. యిప్పుడీ తీతువుపిట్ట తోక తెగినదానిలా ఒకటేగోల.

"కాదు. చలపతి మొండి చెయ్యి చూపిస్తాడు." అని నిశ్చయించుకున్నాడు శ్రీధరం.

"ఈ బ్రిడ్జి క్రితంసారి మీ రొచ్చినప్పుడు లేదుకదూ బాబూ."

"వూ."

"అయ్యగారే కట్టించారు. ప్రతిఏడూ వానాకాలంలో ఈ వాగుకి నీళ్లొచ్చి రాకపోకలకిబ్బందవుతున్నది బాబూ. ఆర్నెల్లయింది, మంత్రిగారు దీనికి ప్రారంభోత్సవం చేసి."

"ఊహూ."

వంతెన బాగానే కట్టారు. సుమారు 20 వేలవుతుంది. ఇరవై వేలు. అంటే ఆ డబ్బుతో నలుగురు ఆడపిల్లల పెళ్లిళ్లు చెయ్యొచ్చు.

తను ఒక్కగా నొక్క చెల్లెలు పెళ్లి చెయ్యలేక పట్టరానివాళ్ల కాళ్లుపట్టి, లేదనిపించుకుని నానా గడ్డి కరుస్తున్నాడు.

వూరికి మధ్యగా తలమానికంగా, మంచుశిఖరంలా తెల్లనిమేడ దగద్దగాయమానంగా వెలుగుతూ, రాజసం ఒలకబోస్తూ నిల్చొనుంది.

అదే చలపతి నివాసస్థానం. ఆ మేడకు అతడు మకుటంలేనిరాజు.

"వూరికి కరెంటు ఎప్పుడొచ్చింది?"

"శానారోజులైంది బాబూ।"

కారు వూళ్లో కొచ్చేసింది।

సాయిబులపాలెంలో పిల్లలంతా ఆడుకుంటున్నారు. వీధి కరెంటు దీపాలను చూసి గుడిసెల్లోని గుడ్డిదీపాలు మోహం ముడుచుకు బిక్కు బిక్కుమంటున్నాయి।

కారునుచూసి హోలోమని అరచి కొంత దూరం వెంటబడ్డారు పిల్లలు।

చంగనాలు వేస్తూ వస్తున్న కోడె దూడ కారు లైట్లు చూసి భయపడి వాళ్లమ్మను కేకేస్తూ వెనుదిరిగి పరిగెత్తుకెళ్లింది!

మేడముందు కారాగటంతోటే చలపతి కొడుకు కూతురు పరుగెత్తుకుంటూ వచ్చారు వాకిట్లోకి। కారులోని క్రొత్త మనిషిని చూసి అక్కడే ఆగిపోయారు.

"చలపతి పిల్లలుగదూ।"

"అవును బాబూ।"

శ్రీధరం కారు దిగి, "ఏరా గుర్తున్నానా........బాబాయిని'" పలకరించి, కూతుర్ని ఎత్తుకున్నాడు. చలపతికొడుకు దగ్గరికి రాలా।

ఎదురొచ్చి ఆహ్వానించేందుకు ఎవ్వరూ రాలేదు। ఆఖరికి చలపతి గూడ।

"ఏం పాపా? నీ పేరేమిటి?"

"లచ్చిమి।"

"వూ........నాన్న పేరేమిటి?"

"నాన్న........వూరెల్లారు?"

"ఏ వూరు?"

"ఏమో"

వరండాలో కుర్చీలో చతికిలబడ్డాడు. చలపతి కూతురు లోపల కెళ్లింది।

అలా చాలాసేపు కూర్చున్నాడు.

తనెందు కొచ్చినట్లు? చలపతికీ, తనకూ సంబంధమేమిటి? ఈ యింటిలో పలకరించే దిక్కులేక చొరవచేసుకు లోపలకెళ్లే ధైర్యంలేక యిలా వరండాలో ఎందుకూర్చోవాల్సి వచ్చింది.

ఇవన్నీ జీవితపు పజిల్‌లో సమాధానం దొరకని ప్రశ్నలు. ఐనా శ్రీధరం వాటిని సాల్వ్ చెయ్యాలన్న ప్రయత్నాన్ని మానుకోలేదు.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ఉండి ఉండి ఎవరిదో దగ్గు విపరీతంగా వినబడసాగింది. గాలికి, వాకిటికిరువైపులావున్న కొబ్బరిచెట్లు గల గలా నవ్వుకో సాగాయి.

గ్యారేజితెరచి, కారులోపలపెట్టి, తాళాలు పట్టుకు వచ్చిన వెంకటస్వామి శ్రీధరం కుర్చీలో జారగిలబడి, తల చేత్తో పట్టుకుని కళ్లు మూసుకు కూర్చొనుండటం చూసి, "ఏం బాబూ యిక్కడే కూర్చున్నారు. లోపల కెళ్లక పోయారా?'' అన్నాడు.

'వూ'

ఇంట్లో కెళ్లి తాళాలిచ్చి వెడుతూ, 'అమ్మగారు పూజలో ఉన్నారల్లే ఉంది. లోపల కెళ్లండి' అని చెప్పి వెళ్లిపోయాడు.

వెంకటస్వామి అలా వెళ్లాక శ్రీధరం లేచాడు. లేని చిరునవ్వునూ, గుండె ధైర్యాన్నీ తెచ్చుకుని హాల్లోకి ప్రవేశించాడు.

హాల్లో సోఫామీదాలగా సీతమ్మగారు పడుకొనున్నది. దగ్గి దగ్గి ఆయాసంతో, బరువుగా శ్వాసపీలుస్తూ, కళ్లు మూసుకొనుంది. దగ్గిరగావెళ్లి కుర్చీ లాక్కుని 'అమ్మగారు' అని పిలిచాడు శ్రీధరం.

ఆమె మెల్లగా కళ్లు తెరచి శ్రీధరాన్ని గుర్తుపట్టింది. అప్రియత్నంగా

ఆమె గాజుకళ్లల్లో అశ్రువులు చేరాయి. మాట్లాడ లేకపోయింది.

శ్రీధరానికి ఆమెను చూసేసరికి మనసు ద్రవించింది। కళ్లు చెమ్మగిల్లాయి।

"ఎన్నాళ్లయింది మంచమెక్కి?"

"ఆర్నెల్లయింది।"

"ఊహూ। మాకు తెలియదు సుమండీ।"

"ఉత్తరం రాశానని చెప్పాడు। రాయలేదేమొ?........పోనీలే।....మీనాన్న తిరుగుతున్నాడా?"

"ఆ। ఆదే తిరగటం।........కళ్లు కనిపించటంలేదు। శుక్లం వచ్చిందట। ఆపరేషన్ చేయించాలి।"

సీతమ్మగారు ఆయాసంతో మాటాడ లేకపోయింది కాసేపు.

శ్రీధరం ఆమెను చూస్తూ కూర్చుండిపోయాడు।

ఆమె పడుకున్నది కుక్కిమంచం। పక్క బట్టలవీ బాగా మాసిపోయాయి. ఆ మూలగాలి అంతగా వచ్చే అవకాశంలేదు। మంచం క్రింద బత్తాయి తొక్కలకు చీమలు పడుతున్నాయి. ప్రక్కనున్న బల్లమీద మందుపొట్లాలు, యింజెక్షను సీసాలు చెల్లాచెదురుగా ఉన్నాయి.

నలుగురి మనుషులకూ తల్లో నాలుకలా తిరుగుతూ, పలకరిస్తూ, నవ్విస్తూ ఉండే సీతమ్మగారు మంచమెక్కారంటే శ్రీధరం నమ్మకతప్పలేదు, ఆమెను చూశాక।

మనిషి కూడ అస్తిపంజరంలా తయారైంది।

"జబ్బేమిటి?"

'ఏం చెప్పను।' ఆ మాటల్లో నిరాశగోచరమైంది। చెప్పుకోలేని ఆత్మక్షోభ ఆమె గుండెల్లో మండుతున్నది। అని గ్రహించాడు।

చలపతిమీద కోపం పెరిగిపోయింది. కన్నతల్లి మంచానబడితే, కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కొడుకు శ్రద్ధ వహించకపోతే ఏ తల్లి హృదయం క్షోభించదు.

నిజంగా చలపతి నైతికంగా ఎంతగా దిగజారిపోయాడు.

చలపతంటే జాలివేసింది. కోపం వచ్చింది.

ద్వందీభూతమైన ఈ భావం అతన్ని కలచి వేసింది.

సిరి కలసివస్తే కళ్లు నెత్తిమీది కెక్కాల్సిన అవసరంలేదు. తండ్రిపోయిన నాటినుంచీ, వారిళ్లా వీరిళ్లా పూడిగంచేసి, అభిమానం చంపుకుని తోటి వారిళ్ల కొంగు పట్టుకు తిరిపెమెత్తి పెంచింది చలపతిని. ఎందుకు? రెక్కలొచ్చాక తనను సుఖపెడతాడని. పువ్వులా, పసిపాపలా చూసుకు పోషిస్తాడని. ఆ ఆశే లేనినాడు ఆమె బ్రతకాల్సిన అవసరం లేదన్నాళ్లి?

తన కష్టం ఫలించి, అనుభవంలో కొచ్చేవేళ, పాలు విరిగిపోతే........ అదేనేమో సీతమ్మగారి పరిస్థితి.

''ఏవయ్యా శ్రీధరం. యింట్లోకి రాగూడదా? నీ కిదేమన్న పరాయిల్లా బాబాయి వచ్చాడని పిల్లలు చెప్పారు. వస్తావేమోనని యింతదాకా చూశా..... వూ ఏమిటి సంగతులు. అంతా బాగున్నారా?''

"ఆ."

"రా. అలా మేడమీద కూర్చుందాం."

విశాలమ్మగారివెంట పిల్లిలా వెళ్లాడు మేడమీదకు శ్రీధరం.

శ్రీధరం కుర్చీలో కూర్చున్నాడు. విశాలక్షి మంచం వాల్చుకు కూర్చుంది. ఒళ్లో పిల్లను కూర్చోబెట్టుకుని.

"ఊ. మావయ్యగారు తిరుగుతున్నారా?"

"ఆ।"

"నీ కెందరున్నారు పిల్లలు?"

చెప్పాడు శ్రీధరం।

విశాలక్షి పిల్ల జుత్తు సవరిస్తూ, "ప్రమీల పెళ్ళి చేస్తున్నారన్న మాట।" అన్నది, అదో విధంగా।

"ఊ।"

"పిల్లాడి దేవూరు? ఏం చేస్తున్నాడు? ఎట్లాఉంటాడు?"

"ఊ।"

విశాలాక్షి క్షణం శ్రీధరాన్ని చూసి, కిసుక్కున నవ్వి, "ఏమిటా పరధ్యానం? దేన్ని గురించీ ఆలోచన?' అన్నది.

ఆమె నవ్వులో చనువున్నా, హేళనే ధ్వనించింది శ్రీధరానికి మాత్రం। సిగ్గుపడ్డాడు। మనస్సుకు నొప్పి కలిగినా, చిరునవ్వు తెచ్చుకున్నాడు.

"అదేంగాదు వదినా। తలనొప్పిగా వుంది।"

"ఏమిటి? నా సంభాషణా"

'అబ్బేగాదు।'

"మరి।"

"రైలు చాలా గింపావిగా వచ్చింది। పైగా చాలా రద్దీగా గూడ ఉంది। ........యింకా చెప్పాలంటే చాలా ఉందిలే!" అన్నాడు భయంగా చూస్తూ శ్రీధరం!

"భలేవాడివే! ఆ చాలా నే చెప్పుమరి!"

చెప్పాలా, చెపితే ఎలా? యిది సమయమా? అన్న సందిగ్ధం క్షణం అతన్నో నిర్ణయానికి రానివ్వలేదు! చెప్పేదామన్నంతలో విశాలాక్షి లేవనే లేచి, "సరేలే! ఉంటావుగా నాల్గురోజులు చెబుదువుగాని! లే! స్నానం చెయ్యి,

భోజనం చేసి విశ్రాంతి తీసుకుందువుగాని!" అని మేడపిగి వెళ్ళింది పిల్లలతో సహా!

విశాల అతని కెప్పుడు అర్థం గాలేదు! ఆమెను అర్థం చేసుకోవాలని శ్రీధరానికి చాలా అభిలాష మాత్రమేగాదు, పట్టుదల కూడాను! ప్రతిసారీ అర్థమైనట్టు ఆమె మనస్తత్వం, ఆమె చనువుగా మసలుతున్నట్లుగానే తోచేది. కాని ఆ ప్రాంతానికి శ్రీధరం వోటమినే పొందగలిగేవాడు. అదే అతనిలో కృత నిశ్చయాన్నీ, మంకునీ కలిగించేది.

తన మాసిన చొక్కా, బనీను ఉంచేందుకు శ్రీధరానికా యింట్లో చోటే దొరకలేదు. నీళ్లు తోడినట్లు రెండోసారి పిలుపు రావటంతో అతడికి కాళ్లు నిలబడలేదు. వో సోఫాలో భద్రంగాపెట్టి, సంచిలోతుండు తీసుకొని, స్నానాల గదికి పరుగుతో వెళ్లాడు.

స్నానం చేసేసరికి చాలా సుఖంగా ఉన్నట్టనిపించింది. ఆలోచనలతో వేడెక్కిన మెదడుకు స్వాస్థ్యం చేకూరింది. క్రొత్త ఉత్సాహం, విద్యుత్తులా నరనరాన ప్రవహించింది.

ఆ హుషారుతోనే వెళ్లి భోజనానికూర్చుని, ఆపుపోసన పట్టబోతూ, "చలపతి రాడా?" అనడిగాడు.

"ఏమో. ఆయనెప్పుడొస్తారో, ఎప్పుడు ఏ క్షణాన వూరెళ్తారో తెలియదు. చెప్పరు. అంత చెప్పని వాళ్లని నే నడగను.... నువ్వు కానియ్." అన్నది విశాలాక్షి.

ఆమె విసుగు గమనించాక, శ్రీధరానికి యిందాకటి ఉత్సాహం కొంత తగ్గింది, ఐనా ధైర్యం తెచ్చుకున్నాడు.

ప్రమీల పెళ్లి గురించీ, పెళ్లి కొడుకు గురించీ, హుషారుగా కబుర్లు చెప్పే

శాడు. తండ్రి ఆరోగ్యం ఎలా క్షీణిస్తున్నదీ, కొడుకు ప్రజ్ఞ గురించీ సవివరంగా చెప్పాడు. ఉద్యోగంలో తనబాధలు వివరిస్తూ, పొలంలేదుగానీ, ఉంటే మడిదున్నుకు బ్రతకటం మంచిదన్నాడు.

అన్నిటికీ విశాలాక్షి 'ఊ. ఆ.' అనటం తప్ప, మరో జవాబు చెప్పలేదు. ప్రశ్నలు వెయ్యలేదు.

అలా, యిందులో ఆమె ఎందుకు బిగదీసుకుపోయిందో బోధపడలేదు. శ్రీధరానికి.

శ్రీధరం చెయ్యి కడుక్కు వస్తుంటే గడపలో కూర్చున్న విశాలాక్షి లేచి "మేడమీద ప్రక్కవేశాను." అని చెప్పి వెళ్లిపోయింది.

శ్రీధరంలో మరి నిరాశే మిగిలింది. ఉసూరుమంటూ వెళ్లి, మేడమీద వేసిన మంచంమీద మేను వాల్చాడు.

పిల్ల తెమ్మరలు మెత్తగా వీస్తున్నాయి. సన్నజాజి పందిరి చిన్నారి కొమ్మ. గంతులేస్తున్నది. ఆకాశంలో చంద్రుడు ఒంటరిగా ప్రయాణం చేస్తున్నాడు.

రైలు ప్రయాణంవల్ల అలసిన దేహానికి ఆ విశ్రాంతి సుఖానిచ్చింది. కళ్లు మూతలు పడసాగాయి.

యింత త్వరగా నిద్రపోవటం శ్రీధరానికిష్టంలేదు. వచ్చినపని మర్చిపోయి మెత్తటి పరుపుమీద వెచ్చటి కలలు కంటూ పడుకోటాని కిది సమయంగాదు. చలపతి వచ్చేదాకా ఆగి, నాలుగు సంగతులు మాట్లాడి, మొగో ఆడో తేల్చుకుంటే తెల్లవారుజాము రైలుకి తిరుగు ప్రయాణం చెయ్యవచ్చు.

కుర్చీ ఆ చివరకు లాక్కుని బీడీ వెలిగించుకు కూర్చున్నాడు, కాళ్లు పిట్ట గోడకు తన్నిపట్టి.

కొండ మీద కూర్చున్నట్టుంది। అక్కడ నుంచి చూస్తే, వూళ్లో యిళ్లు బొమ్మరిళ్లమాదిరిగా గోచరమవసాగాయి। వూళ్లో ఎక్కడా అలికిడన్నమాట లేదు. పల్చటి తెల్లనివలువ ధరించిన స్త్రీలా ఉంది ప్రకృతి।

లుంగ లుంగలుగా పొగ వదులుతూ వుంటే శ్రీధరం ఆలోచనలు కొన్నేళ్ల వెనక్కు వెళ్లాయి। గత స్మృతులు స్పష్టంగా, కళ్లముందు గోచరమైనాయి। ........తండ్రిలేని చలపతిని వెంటబెట్టుకుని సీతమ్మగారు బ్రతుకు తెరువుకోసం రామదాసుగారి పంచను చేరింది। ఆమెకు ఆ స్తితిలో రామదాసుగారికన్న ఆప్తులు, ఆదుకునేవారు కనుపించలేదు. ఈనాటికి రామదాసుగారింటికి, ఏ బంధుత్వపు ఆధారంతో సీతమ్మగారు వచ్చిందో ఎవ్వరికీ తెలియదు. శ్రీధరం తెలుసుకోవాలన్న ప్రయత్నము చేసినా ఫలించలేదు!

రామదాసుగారికి అభిమాన ధనముందేగానీ మరేంలేదు. దాన్ని ఆయన భద్రంగా చూచుకునేవారు! చేసేది హైస్కూల్లో సెకండరీగ్రేడు టీచరు ఉద్యోగం!

యివన్నీ సీతమ్మగారికి తెలియకగాదు. తెలిసీ రాక తప్పలేదు!

ఏ ఆధారమూలేని అనాధ బ్రతకటానికి ఎన్ని పాట్లు పడాలో అన్నీ అనుభవించింది సీతమ్మగారు.

ఆమెకు కన్నవాళ్లిచ్చింది., పుష్టి, పొంకమూగల శరీరము. మెట్టినవాళ్లింట సద్గుణవంతుడైన భర్త దొరికాడు. భర్త కాలంచేస్తూ ఆమెకు కష్టాలకు, ఈతి బాధలకు తట్టుకుని నిలువగలట్టి మనస్సును ధైర్యాన్నీ ప్రసాదించాడు!

ఆమె శరీరంలోని రక్తమంతా చలపతి చదువుకే సరిపోయింది.

చలపతి ఆమె కష్టానికి తగ్గ ప్రతిఫలాన్ని ప్రతి సంవత్సరమూ తెచ్చేవాడు! ఒక్కొక్క మెట్టే ఎక్కుతూ, చలపతి బి.ఏ. చదువుతూ ఉండగా సీతమ్మగారి

కష్టాలు గట్టెక్కాయి.

గ్రామకంఠంనుంచి పొలిమేరదాకా పంటపొలాలు, కొన్నితరాలుగా యినప్పెట్టెలో బంధింపబడ్డ ధనలక్ష్మి, గల సంపన్నుల ఏకైక కుమార్తె చలపతికి అర్ధాంగిగా వచ్చేసింది।

ఇదంతాకలగాదు! కల్పనాగాదు! మహామాంత్రికుడు, తన శక్తి సహాయంతో మరుభూమిలో మహానగరాన్ని తెల్లవారేసరికి సృష్టించినట్లుగా చలపతి అదృష్టము కలిసి వచ్చింది!

ఉండేలు బద్దలా, పల్చగా, బలంగా ఉండేవాడు చలపతి! మొహంలో తెలివితేటలు, విశాలమైన కళ్లల్లో ప్రస్ఫుటమయ్యే కాంతి, చూపరులకు ఆకర్షణీయంగా ఉండేవి. చదువుకుంటున్నాడు! కనుక సంపన్నుల కళ్లు చలపతిమీద కేంద్రీకరించాయి!

పెద్దవాడు, మంచి చెడ్డలు చూచేవాడు కనుక రామదాసుగారిని సంప్రదించారు మొదట! ఆయన అంతావిని అంగీకరించారు. సీతమ్మగారిని పిలిచి అంతా చెప్పి, "ఏమంటావు?" అనడిగాడు

సీతమ్మగారు ఆలోచించింది. "ఇన్నాళ్లూ పెంచినదాన్ని, ఆ బి. య్యే. పూర్తిచేసి, వాడు ఉద్యోగంలో చేరేదాకా కష్టపడలేనంటారా?" అన్నది

"అంటే।......."

"అదీ చెబుతాను। కష్టాలు వోదరికి చేరబోతున్నాయి! చలపతి చేతికంది వస్తాడు మరో సంవత్సరంలో! ఇప్పుడు డబ్బుకాశపడి వాణ్ణి యిల్లరికం పంపమంటారా" అని ప్రశ్నించింది।

"అవుననుకోండి...." రామదాసుగారి కదీ సమంజసంగానే తోచింది.

"ఈనగాచి నక్కలపాలు చేసినట్లు ఇన్నాళ్లూ శ్రమించి, యిప్పుడు ఇల్లరికానికి పంపటం ఎంతవరకు సబబు?" అన్నది ఆలోచించతగ్గ విషయం!

ధన ధాన్యాదులతో తులతూగేవారు తమహోదాను తల్చుకుని గర్వించటంలో తప్పేంలేదు. ఐతే వాళ్ల కష్టాలలోపుట్టి, అందులోంచే వో గౌరవనీయమైన స్థితికి వచ్చిన వాళ్లను సమంగా గౌరవించటం అటుంచి హీనంగా చూడరన్న నమ్మకం లేదు!

డబ్బువల్లే మనుష్యులు సుఖపడతారంటే నమ్మకం తక్కువమాట! సుఖం మాట దేవుడెరుగు. ఆ ధనంవల్ల మానవుల్లో అహంభావం పెరిగి, కష్టాల వలలో చిక్కుపడటం కూడ కద్దు! మరి డబ్బుకు విలువలేదనలేం! ఈ ప్రపంచంలో డబ్బుగలవాడికి అందని సౌఖ్యాలు, అనుభవించలేని విలాసాలు లేవు! కనుక డబ్బుకు విలువలేకపోలేదు। ఆ విలువ ఎవరు సృష్టించారన్నది వేరే విషయం।

దానా దీనా చలపతి నిర్ణయానికి వదిలేశారు. ఇల్లరికం వెళ్లటమా, వద్దా అన్నది।

తను దరిద్రంలో పుట్టటంవల్ల ధనంయొక్క విలువ బాగా గ్రహించగలిగాడు చలపతి! అందుకనే వివాహనంతరం, ఇల్లరికాని కెళ్లటానికి అంగీకరించాడు.

సీతమ్మగారు మరి మారు మాట మాట్లాడలేదు!

అలా చలపతి జీవితంలో చీకటి కరిగిపోయి పండు వెన్నెల కాచింది!

*　　　*　　　*

"ఐతే వెళ్లక తప్పదంటావ్?" చలపతి అడిగాడు!

"వ్రూ!"

"పోనీ రేపు వెళ్లగూడదూ?"

"ఈ పూటవుండి చేసేది మటుకేముంది! కడుపునిండా తినటమూ, కంటి నిండుగా నిద్రపోవటమేగా! యింటికి వెళ్లి మరోచోటన్నా డబ్బు ప్రయత్నం చేసుకుంటాను!"

చలపతి క్షణం మాట్లాడలేదు! శ్రీధరాన్ని నిస్సహాయంగా చూశాడు!

"నీ ఉత్తరం వచ్చిన దగ్గర్నుంచీ డబ్బు కోసమే తిరుగుతున్నాను. దొరక లేదు!" అన్నాడు ఎటో చూస్తూ చలపతి!

ఆ మాటల్లో నిజాయితీ అంతగా కనబడలేదు శ్రీధరానికి! కన్నీళ్లు తుడిచే మాటలవి! శ్రీధరాని కా విషయం తెలుస్తుంది.

"పోన్లే! నీ ప్రయత్న లోపంలేకుండా తిరిగావు! దొరకలేదు! నీ కివ్వాలని వున్నా, నా కాళ్ల శని తీరన్ది ఎలా దొరుకుతుంది డబ్బు!"

ఆ మాటలు అన్నాక, చలపతి మొహాన్ని చూశాక, ఎందుకన్నానా అని పించింది శ్రీధరానికి! చేతులు కాలింతరువాత ఆకులు పట్టుకుంటే ప్రయోజనం లేదు మరి!

చలపతి మోహంలో ఎరుపుదనం గోచరమైంది! కుర్చీలో కూర్చోలేక పోయాడు చలపతి! దీర్ఘంగా నిట్టూర్చాడు! ఆ నిట్టూర్పులో అశక్తత ఉంది! లీలగా బాధా ఉంది.

లేచాడు! చెత్తో మోహాన్నొకసారి తుడుచుకున్నాడు! ఆలోచన చేశాడు! మునిపళ్లతో క్రింది పెదిమను నొక్కాడు! ''సరే! నేనిప్పుడే అలా వెళ్లొస్తాను!" అని వెళ్లిపోయాడు చర చరా!

'టిఫిన్ చేసి వెళ్లండి!" విశాల కేకపెట్టింది.

చలపతి వినిపించుకోకుండానే వెళ్లిపోయాడు!



శ్రీధరానికి, ఆ భార్యాభర్తలను చూస్తుంటే తమాషాగా వుంది! యిద్దరూ ముభావంగా ఉంటారు, వాళ్ల మాటల్లో జీవం ఉండదు! ఒకర్నొకరు అయిష్టంగా చూసుకుంటారు!

"సరే! నువ్వు రావయ్యా! టిఫిన్ చేద్దువుగానీ!" విశాల భర్త వెళ్లినవేపు అదోలాచూసి శ్రీధరాన్ని పిలిచింది.

శ్రీధరం వెళ్ళి కాళ్లూ చేతులూ కడుక్కునివచ్చి కూర్చున్నాడు, కండువాతో ముహం తుడుచుకుంటూ!

"అదేమిటి అలా క్రింద కూర్చున్నావ్!"

"ఫరవాలేదులే వదినా!"

ఆజ్ఞగానే భావించి పీటవేసుక్కూర్చున్నాడు!

వేడి వేడి పకోడీలు వెండి పళ్లెంలో పొగలుగక్కుతున్నాయి!

తీరుబడిగా గోడ కానుకుని ఒక్కొక్క పకోడీ కసిగా నములుతూ, ముందు కర్తవ్యాలోచనలో పడ్డాడు శ్రీధరం!

చలపతిమీద తండ్రికున్న నమ్మకంతో చెల్లెలు పెళ్ళికి లగ్నాలు నిశ్చయించుకున్నాడు! యింతాచేసి, మరో రెండువారాల్లో ప్రమీల పెళ్లి! చేతిలో ఎర్రని ఏగానీ లేదు; కట్నాలు లేకపోయినా, కానుకలు, లాంఛనాలు ఉండనే ఉన్నాయి! అందునా మగపెళ్లివారు ప్రమీల అందచందాలను, రామదాసుగారి వంశ మర్యాదనుచూసి కట్నమడగలేదు! మరి పెళ్లి ఘనంగా చెయ్యకి తప్పదు! ఆకాశమంత పందిరీ, భూమంత అరుగు వెయ్యకపోయినా వచ్చిన వాళ్లకు పెళ్లి నాలుగునాళ్లూ ఏ లోపం రాకుండా అన్నీ అమర్చాలి.... అంతే డబ్బు చేతిలో ఉండాలి!

ఏలా యిప్పుడు!

''ఏమిటయ్యా అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్?"

"ఏం లేదు వదినా!"

"ఏం లేకపోవటమేమిటిలే! నాకంతా తెలుసు! ఐనా నా చేతిలో ఏముంది? నేనేం చెయ్యగలను!"

శ్రీధరం మాట్లాడలేదు.

''నీ ఉత్తరం వచ్చినప్పటి నుంచీ చెవినిల్లుగట్టుకు చెబుతున్నా! అబ్బాయెప్పుడో అర్థాంతరంగా వస్తాడు! అప్పుడు డబ్బు కోసం తిరగటం, దొరకలేదని తేల మోహాలెయ్యటం బాగుండదు! మీరేదో సర్దుతారని వాళ్లు కొండంత ఆశతో ఉంటారు. పైగా యిది పిల్లపెళ్లి! ఆగిపోయిందంటే నలుగుర్లో అవమానంపాలుగావాలి! ఐనా శ్రీధరం! మీ కవమానం జరిగితే ఒకటీ తనకు జరిగితే ఒకటా! ఆ మాత్రం గూడ గ్రహించకపోతే ఎలా!''

''సమయానికి దొరకలేదేమో వదినా!''

''అది నిజమే ననుకో కాదనను! ఐనా ముందు జాగ్రత్త ఉండొద్దూ! ప్రతిసారీ యింతే శ్రీధరం? ఇప్పుడు ఈ విషయమనిగాదు! డబ్బు కనబడితే చాలు! అది ఖర్చయిందాకా నిద్రపట్టదు! వాళ్లకీ వీళ్లకీ అప్పులివ్వటం. పోనీ తీసుకున్నవాళ్లు సమయానికిస్తారా అంటే అదీలేదు: యివ్వకపోంగా సూటీపోటీ మాటలనటం!....ఐనా ఈయనకు బొత్తిగావేమీ తెలియదనుకో!....అప్పటికే ఏమో మొగాయన ఆయనిష్టం ఏమన్నా చేసికోమని ఏమీ పట్టించుకోను. ఐనా నానోరు బయటికొస్తుందిగాని, ఆయనచేసే పనులు కనబడవు!....అయ్యో! అనేమిటి అప్పుడే చెయ్యి కడుక్కున్నావ్ యింకా నాలుగు పకోడీలు తీసుకో''

''వద్దు వదినా."

"సరే! కూర్చో!.....మునుస్వామీ కాఫీ అందుకో అయ్యగారికి!........వూ, అత్తయ్యగారిని, మావయ్యగారిని అడిగానని చెప్పి నా నమస్కారాలందచెయ్యి. ఎలాగూ పెళ్లి కొస్తామనుకో!

శ్రీధరం కాఫీ త్రాగి కప్పు ప్రక్కన బెట్టి, తుండుతో మొహం తుడుచుకుని, "పెళ్లికి అమ్మ గారిని గూడ తీసుకురాండి! నాన్న! చూడాలి ఎలాఉందో! అని అడుగుతున్నాడు!"

"ఏం వస్తుందో! పెద్దదై పోయింది శ్రీధరం! మన మాట చెవికెక్కించుకోదు! మందు తినదు సరిగ్గా! అసలే పెద్ది తనమా! మందు సరిగ్గా వంట పట్టదు. ఒకటికాదులే ఆమెతో! అలాగే విసుకున్నా, కసురుకున్నా వేళ కింత మందిచ్చి, కడుపులో ఇంత ఆధరువిస్తున్నా!"

"ఏది చలపతి రాలేదింకా?"

"ఏమో! మళ్లీ ఎక్కడ కెళ్లారో? అయనకు తోచదు ఒకరు చెబితే వినరు!"

శ్రీధరం అక్కణ్ణుంచి లేచి చక్కా వచ్చాడు! ఆమె చెప్పేది వినబుద్ధి కాలేదు!

శ్రీధరం కాలి అడుగుల సవ్వడి విని సీతమ్మ మాగన్నుగా మూసుకున్న కళ్లు బలవంతాన తెరచి, "శ్రీధరం!" అని పిలిచింది!

"ఏమ్మా!" వెళ్లి దగ్గరిసా కూర్చున్నాడు!

"వూరికెళ్తున్నావా?" మెల్లగా అడిగింది!

"అవునండీ!"

"ఊ!.....ప్రమీలకు పెళ్లి కళొచ్చుంటుంది! ఎలా ఉందో?" వూహించుకోటానికి ప్రయత్నించసాగింది!

"మీరు పెళ్లికి రారూ!........తప్పక రావాలి".

"ఎలా వచ్చేది?.........ఎవరు తీసుకొస్తారు"

"అదేమిటి చలపతికి గట్టిగా చెబుతాను మిమ్మల్ని తీసుకు రమ్మని. మీ చేతుల్లో ఆడుకున్నదది. యిప్పటికీ మిమ్మల్నీ గుర్తుకు చేసుకుంటుంది".

"అవును. నేను మీ యింటి కొచ్చేసరికి మూడేళ్ల దానికి. బుట్టబొమ్మలా ఉండేది. 'అమ్మా'! అంటూ కొంగు పట్టుకు వదిలేదిగాదు. ఏ పని చేస్తున్నా చంకలో కూర్చొని దిగేదిగాదు. ........ సీతమ్మగారు గత స్మృతులను నెమరు వేసుకోసాగింది.........

"........యిక్కడ పిల్లలున్నారు. ఏం లాభం? బామ్మా అనటంటే తప్పు. వాళ్లని దగ్గరికి రానివ్వరు? ఈ వయస్సులో వాళ్లను దగ్గర కూర్చోబెట్టుకుని, వాళ్ల ముద్దు ముచ్చట్లు, ఆటపాటలుచూచే అదృష్టం, ఎన్నిపూజలు చేసుకుంటే లభ్యమౌతుందో?"

సీతమ్మగారది స్వగతంగా అనుకున్నా శ్రీధరం విన్నాడు. ఆమె ముడుతలుపడ్డ మొహంలో క్షణకాలం కదిలిన క్రీనీడలను అతను గమనించాడు.

ఎందుకో కనుకొనుకుల్లో నీళ్లుచేరాయి. ఆమె పరిస్థితిచూచాక, చూచాయగా విన్నాక గుండెల్లోంచి ఏడుపు బయట పడలేక గొంతుకలో కొట్టుకోసాగినా, దిగమింగుకున్నాడు. ఆ పరిసరాల్లో గాలికూడ భయంభయంగా కదిలాడు తుంటుందనిపించింది. అక్కడ స్వేచ్ఛగా ఏలా ఏడవగలడు శ్రీధరం.

లేచివస్తుంటే సీతమ్మగారు "వెడుతున్నావా? మళ్ల కనబడతావో లేదో, వాడితో చెప్పటం మరచిపోకు." అన్నది

"అలాగే"

"శ్రీధరం."

"ఏమ్మా।"

"ఈ కొంగున పటిక బెల్లం ఉంది చూడు। పిల్లలకు తీసుకెళ్లు।"

''ఎందుకండీ।''

''ఫర్వాలేదులేనాయనా। పిల్లలు తింటారు''

పటికబెల్లం తీసుకుని మళ్లీ కొంగుముడేశాడు శ్రీధరం।

సంచీ తీసుకుందామని మేడమీద కెళ్తుండగా చలపతి మాటలు విని అగి అగిపోయాడు శ్రీధరం।

''శేషగిరి పైకమిచ్చాడటగా? ఏం చేశావ్?''

''...............''

''మాట్లాడవేం బెల్లంగొట్టిన రాయిలా'' గద్దించాడు చలపతి।

''ఎందుకలా గొంతు చించుకుంటారు? నేనేం తినలేదు।''

''ఊహూ। మరేం చేశావు?

''వెంకటరత్నంగారి కిచ్చేశాను।''

''ఆయనొచ్చి అడిగాడా?''

''అడగాలా। అదొక్కటే తక్కువ। ఆ ముచ్చటా తీరుతుందిలెండి।''

''అన్ని ముచ్చట్లు తీరుతూనేఉన్నాయి।''

''అన్నీ ఉన్నా అనుభవించే అదృష్టమూ ఉండాలి।''

''అవును। ఆ అదృష్టమేవుంటే మీ డబ్బు కాశపడి నిన్ను పెళ్లాడేవాడినే గాదు।........ ఛ ఛ।''

''ఇప్పుడేమైందని? ఎందుకలా విసుక్కోవటం?'' విశాల మాటల్లో లాలింపు, సంజాయిషీకూడ ఉన్నాయి।

''ఆ డబ్బువస్తే శ్రీధరాని కివ్వచ్చొనని అనుకున్నాను.''

''మరా మాట నాకు చెప్పారా?.........నాకేం తెలుసు। డబ్బు యింట్లో ఉండటమెందుకు, బాకి ఐనా తీరుతుందని వెంకటరత్నంగారిని పిలిపించి యిచ్చేశాను।''

''పెద్ద ఘనకార్యమే చేశావు!''

''ఏమో। ఆడదాన్ని నేనేం ఘనకార్యాలు చేస్తాలెండి, మీరు చేస్తున్నారుగా ఘనకార్యాలు। చాలు. యిద్దరం చెయ్యటం మొదలుపెడితే, యిహ నా పిల్లలు తండ్రిలాగానే వారాలు చేసుకు బ్రతకాలి।''

''నోర్ముయ్।''

విశాల చెంప ఛెళ్లుమంది।

శ్రీధరం క్షణం నిశ్చేష్టుడయ్యాడు। ఒక్క ఉదుటున లోపలకెళ్లి ఆడదాని మీద చెయ్యి చేసుకున్న చలపతిని కసిదీరా........

కాని అదేం జరుగలేదు।

విశాల ఏడుస్తూ కొంగు నోటికడ్డం పెట్టుకుని మేడదిగి వెళ్లిపోయింది గబ గబా।

శ్రీధరం అక్కడే తటపటాయిస్తూ నిలబడిపోయాడు కొన్ని క్షణాలు।

తన రాకవల్ల అసలే అంతంతమాత్రంగా వున్న భార్యా భర్తల మధ్య అనుబంధ బంధం—పూర్తిగా గాకపోయినా—తెగిపోతుందేమోనన్న అందోళన కలిగింది।

అవతల రైలుకు వెళ్లాలన్న జ్ఞాపకం వచ్చి లోపలకు వెళ్లి సంచీ తీసుకున్నాడు శ్రీధరం।

చలపతి తలచేతుల్తో పట్టుకుని స్థాణువుగా కూర్చున్నాడు కుర్చీలో।

"చలపతీ! వెళ్లొస్తాను."

'వూ!.... వూ' పద!' చలపతి కళ్లలో ఎర్రదనం లీలగా గోచరమైంది శ్రీధరానికి.

విశాల వదినకు వెళ్లొస్తానని చెప్పి, శ్రీధరం వెళ్లి కారులో కూర్చున్నాడు! మనస్సులో ప్రమీల పెళ్లెలా చెయ్యాలన్న గాభరా ఉండనే ఉంది! అది తీరే మార్గం లేదు!

క్షణాలు యుగాలుగా తోచసాగింది శ్రీధరానికి! త్వరగా అక్కడినుంచి వెళ్లి యింట్లో వాలదామని వుందీ. చలపతి వస్తున్నాడేమోనని తొంగిచూశాడు రెండుసార్లు! ఊహూ! జాడలేదు! రైలుకు టైమవుతున్నది! "రాడేం" అని విసుక్కున్నాడు.

"మళ్లీ ఏం ఘర్షణ పడుతున్నారో!" అని మథనపడ్డాడు.

"వెంకటస్వామీ! అయ్యగార్ని పిల్చుకురా! అని చెప్పాడు!

అంతలోనే చలపతి విసురుగావచ్చి కారులో కూర్చుని, 'త్వరగా పోనీయ్!' అన్నాడు కర్కశంగా!

కారు గుంటలు, మెరకలలో ఉయ్యాలలూగుతూ పరుగెత్తసాగింది!

చలపతి గంభీరంగా రాజుకుంటున్న పొయ్యిలాగా ఉన్నాడు!

కారు పరుగెత్తుతుంటే, తెల్లని దుమ్ము అందమైన ఆడదాని చీరకొంగులాగ వుంది.

చిన్నప్పుడు చలపతి నవ్వుతూ, విప్పారిన మొహంతో కష్టాలేమీ లేనివాడులా ఉండేవాడు! సెలయేరులా గలగల మాట్లాడుతూ, కోడేత్రాచులా దర్పంగా సోయగంతో, నడిచేవాడు!

పెళ్లయిన ఈ కొద్ది సంవత్సరాలకే చలపతి పూర్తిగా మారిపోయాడు!

వెనుకటి చలాకీతనంలేదు।

ఎందుకిలా ఐనాడు?

ఏమిటి కారణం।

సమాధానాలు దొరకలేదు శ్రీధరానికి। శ్రీధరానికి ఆ ప్రశ్నలకు సమాధానాలు ఆలోచించగలిగిన మేధస్సులేదు। ఉంటే స్కూల్ ఫైనల్ మూడుసార్లు చదవాల్సిన అవసరం లేదుమరి। స్కూల్ మాష్టరు ఉద్యోగంలోనే జీవితాన్ని సరిపెట్టుకోవాల్సిన అవసరముండేదిగాదు।

రైలుస్టేషను కనుచూపు మేరలో కొచ్చేసింది।

తనకు డబ్బివ్వలేకపోయినందుకు విచారిస్తున్నాడేమో చలపతి। పైగా ప్రక్కప్రక్కన కూర్చుని మంచీచెడ్డా మాట్లాడకుండా ఏమిటీ మౌనపు తెర।

తెర తేసేశాడు శ్రీధరం। విసుగొచ్చే।

"చలపతీ।"

"ఊఁ"

"చాలా తొందరపడ్డావ్।"

"అంతా విన్నావా?"

"కొంతవరకు।"

"మరి।"

"ఆమె అన్న దాంట్లో తప్పుగానీ, చెయ్యి చేసుకోతగ్గ అవసరంగాని ఏం లేదు।"

"నీకు తెలియదురా। మాకు డబ్బు లేకపోవచ్చు। కానీ నాకూ అభిమానముంది। ప్రతి నిముషం దాన్ని దెబ్బకొట్టటం సహించలేను।"

స్టేషనుముందు కారుకన్న రైలే ముందు ఆగింది. వెంకటస్వామి టిక్కెట్టు తెచ్చేసరికి శ్రీధరం సెకండ్‌క్లాస్ కంపార్ట్‌మెంటులో కూర్చున్నాడు.

ఎన్నో మాట్లాడాలనుకున్నా, యిద్దరికీ మాటలు పెగల్లేదు. ఒకర్నొకరు కళ్లతోనఖశిఖపర్యంతం పరామర్శించుకున్నారు.

"నువ్వు చాలా మారిపోయావు చలపతీ." రైలు బయలుదేరుతుండగా అన్నాడు శ్రీధరం, ఎటో చూస్తూ అదోలా.

కంపార్ట్‌మెంటుతో తనూ నడుస్తూ, "అవును. మారాను." అన్నాడు చలపతి కళ్లలో నీళ్లు గిరికీలు కొడుతుండంగా.

"సరేవుండు."

"ఉంటాను."

"నాన్నకేం చెప్పమంటావు?"

"ఇదిగో ఉత్తరం చదువుకో."

రైలు ముందుకు సాగింది.

చలపతి అక్కడే రైలు వెళ్లిన వైపే చూస్తూ నిలబడ్డాడు.

ఆలా ఎంతసేపున్నాడో శ్రీధరానికి తెలియదు. తెలిసే అవకాశమూలేదు. అవుటర్ సిగ్నల్ దగ్గర రైలు కొండమలుపు తిరుగుతుంది మరి.

అంతవరకూ గాలికి రెపరెపలాడుతూన్న ఉత్తరాన్ని విప్పిచూశాడు.

గజిబిజిగావున్న అక్షరాలు పోల్చుకుని చదువుకున్నాడు శ్రీధరం........

"నేనున్నది బంగారు పంజరం. నాకై నేను కావాలని ఈ పంజరాన్ని ఎంచుకున్నాను. దీన్ని వదలిరావటం అసాధ్యం.

శ్రీధరం। ధనంవల్లే మనిషి సుఖపడతాడనుకోవటం కేవలం భ్రమ। నిన్ను చూస్తుంటే నాకు ఈర్ష్యగా ఉంది। నీలా స్వేచ్ఛగా స్వతంత్రంగా వ్యవహరించే అవకాశం లేదు నాకు। ధనవంతుడనన్న విశేషము తప్పిస్తే నువ్వు పొందే ఆనందంలో నూరోవంతు కూడా నేను పొందలేకపోతున్నాను!

ప్రమీల పెళ్లికి డబ్బివ్వలేకపోయానంటే, ఎందుకు నాకీ ధన ధాన్యాలు! నావాళ్ల తినేందుకు, అనుభవించేందుకు లేని ఈ సౌభాగ్యం నాకు దేనికి!

నువ్వేమైనా అనుకో శ్రీధరం. నేను చాలా దురదృష్టవంతుణ్ణి!

నా దురదృష్టాన్ని తల్చుకుని మీ అదృష్టాన్ని తల్చుకుని బాధపడని క్షణం లేదు।

అంతే నేను చేయగలిగింది........!

శ్రీధరం ఉత్తరం చదువుతుంటే కన్నీళ్లొచ్చాయి! చలపతి అనుభవిస్తున్న దురవస్థకు!

చలపతి మెచ్చుకున్న తన అదృష్టాన్ని తల్చుకుని అదోలా నవ్వుకున్నాడు శ్రీధరం!

---

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 15—10—65)